వైఎస్ఆర్
కడప-అన్నమయ్య
తెలుగు దాపీయ దినపత్రిక
వార్త
సోమవారం 05 జనవరి 2026

షిర్డీ సాయిబాబా స్వామికి ప్రత్యేక పూజ

చిన్నమండెం జనవరి 4 ప్రభాతవార్త:

మండలంలోని బోరెడ్డిగారిపల్లిలో మంత్రి స్వగృహంలో లోక కల్యాణం కోసం ఆదివారం శ్రీ షిర్డీ సాయిబాబకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు విశేష పూజా కార్యక్రమములు నిర్వహించారు. ఇందులో భాగంగా మొదట గణపతి పూజా అనంతరం సాయిబాబా వారి పాలరాతి విగ్రహానికి విశేష ద్రవ్యాలతో అభిషేకం. మరియు అర్చన అనంతరం కర్నూలు నుండి వచ్చిన బాబా భజన బృందం వారిచే భజన కార్యక్రమములు జరిగినవి. పై పూజలు శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం ఇఓ మరియు ఉపప్రధాన అర్చకులు ఎం.శంకరయ్యస్వామి, మహన్యాస పరాయణదార్ ఎం.రాచయోగేశ్ స్వామి, పరిచారిక రాచయ్య స్వామి వార్ల నిర్వహణలో పూజలు జరిగినవి, సాయిబాబా వారి పూజా భజన కార్యక్రమంలో విశేషంగా భక్తులు పాల్గొని శ్రీ సాయిబాబా వారి అభిషేక తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి అనుగ్రహాన్ని పొందడం జరిగింది. అనంతరం కార్యక్రమములో పాల్గొన్న జనులందరికీ మంత్రివర్యులు అన్నప్రసాద వితరణ చేశారు.

నేడు డయిల్ యువర్ ఏపిఎస్‌పిడిసిఎల్ సిఎండి

మదనపల్లె, జనవరి 4 ప్రభాతవార్త :

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10గంటల నుంచి 12.30గంటల వరకు డయిల్‌యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఛైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే డయిల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూల్, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు సెల్‌నెంబర్ 8977716661కు కాల్‌చేసి విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అదే విధంగా సర్కుల్ స్థాయిలోనూ డయిల్ యువర్ ఎస్ఈ కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10గంటల నుంచి నుంచి 12.30గంటల వరకు నిర్వహించే డయిల్ యువర్ ఏపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమంతో పాటు ఉదయం 8.30గంటల నుంచి 9.30గంటల వరకు డయిల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు.

గండికోట ఉత్సవాలను

విజయవంతంగా నిర్వహిద్దాం : కలెక్టర్

జనవరి 11, 12, 13 తేదీల్లో వైభవంగా గండికోట ఉత్సవాల నిర్వహణ

కడప, జనవరి 4 ప్రభాతవార్త :

రాయలసీమ చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే గండికోట "గండికోట ఉత్సవాల" ను అత్యంత వైభవంగా నిర్వహించేలా ప్రత్యేక కార్య చరణ ప్రణాళికలు రూపొందించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం గండికోట ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా అధికారులతో, ఈవెంట్ నిర్వహక ప్రతినిధులు, జిల్లా పర్యాటక శాఖ, ఏపిటిడిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గండికోట పర్యాటక ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా చేపట్టే అన్ని రకాల కార్యక్రమాలకు సంబంధించిన మ్యాపులను ఈవెంట్ మేనేజర్లు ప్రదర్శించగా జిల్లా కలెక్టర్ వాటిపై పలు సూచనలు, సలహాలను అందించారు. పనుల నాణ్యతతో ఎలాంటి రాజీ లేకుండా రాయలసీమ వైభావాన్ని, గండికోట చారిత్రక ప్రాశస్త్యాన్ని వివరించే అన్ని రకాల కార్యక్రమాలను ప్రణాళిక ప్రకారం పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 11, 12, 13 తేదీల్లో జరగనున్న గండికోట పర్యాటక ఉత్సవాలను జిల్లా పర్యాటక, చారిత్ర, సాంస్కృతిక వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసేలా, దేశం నలుదిక్కులా చాటేలా ఉత్సవాల నిర్వహణ ను విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయం తో పని చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ తో పాటు హైదరాబాద్, బెంగుళూరు లకు చెందిన ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ స్టుడెంట్స్, విసిలను ఉత్సవాల్లో భాగస్వామ్యం చేయడం అలాగే ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, చిత్ర కళలపై పర్ఫార్మెన్స్, పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉత్సవాలు జరిగే మూడు రోజుల పాటు ఉదయం 5.30 గంటల నుండి సాయంత్రం 6.30 గంటల వరకు వివిధ అంశాలపై ప్రదర్శనలు ఉంటాయన్నారు. మొదటి రోజు రాయలసీమ ప్రాంత చారిత్రక, స్థానికత సాంస్కృతిక వైభవాన్ని తలపించేలా వేదికపై కథలు చెప్పడం,నృత్య రూపకాలను ప్రదర్శించడం వంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఒక నిర్ణీత ప్రదేశంలో అడ్వెంచర్ స్పోర్ట్ తోపాటు సాంస్కృతిక క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు.రెండవ రోజు రాయలసీమ వంట రుచుల పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఇందులో ఏవైనా పాల్గొనే అవకాశాన్ని కల్పించడంజరుగుతుందన్నారు. ఈ ఉత్సవాలకు సంబంధించి గండికోట భౌగోళిక అంశాలు, ప్రకృతి అందాలు, గండికోట చారిత్రక వైభవాన్ని ఉట్టి పడేలా తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో వాయిస్ ఓవర్, కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు. అంతే కాకుండా ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా ప్రఖ్యాత మ్యూజిషన్ లను కూడా ఆహ్వానించి లైవ్ షోను కూడా ప్రదర్శించే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే ప్రత్యేకంగా గండికోట ఉత్సవాలకు సంబంధించి హెల్ప్ డెస్క్, రిజిస్ట్రేషన్ పాయింట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇంటాక్ సంస్థ ఆధ్వర్యంలో గండికోట సాంస్కృతిక వైభవాన్ని తెలిపే కల్చర్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. సౌకర్యాలను సంతృప్తి స్థాయిలో తాత్కాలిక వసతి గృహాలు, అన్ని రకాల రుచులతో కూడిన ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పర్యాటకులకు సంతృప్తి కరమైన అనుభూతిని అందించేలా కార్యక్రమాలను తీర్చిదిద్దాలని సంబందిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ముందస్తు మీడియా ప్రచారం, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ,డ్వామా,డిఆర్డీఏ, మెప్మా పిడీలు ఆది శేషా రెడ్డి, రాజ్యలక్ష్మీ, కిరణ్ కుమార్, డీపీపీ రాజ్యలక్ష్మి, రిమ్స్ సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు, డిఎంహెచ్ఓ డా. నాగరాజు, ఏపీ టిడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం,డీఈ పెంచలయ్య, ఎపిఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ఈ చంద్రశేఖర్, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఈ ఏడుకొండలు, జిల్లా ఫైర్ ఆఫీసర్ ధర్మారావు, ఇంటాక్ ప్రతినిధి చిన్నపరెడ్డి, విజ్ క్రాఫ్ట్ ఈవెంట్ మేనేజ్మెంట్ డిజిఎం నంద కుమార్, మేనేజర్ ఉర్బీ తదితరులు పాల్గొన్నారు.

డిఐజిచే పోలీస్ స్టేషన్ తనిఖీ

సదుం జనవరి 4 ప్రభాతవార్త

పోలీస్ స్టేషన్లో తనిఖీ చేసిన ఎస్పీ

కొత్తగా ఏర్పాటు అయిన అన్నమయ్య జిల్లా పరిధిలోకి వచ్చిన సదుం పోలీస్ స్టేషన్ను ఆదివారం కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అన్నమయ జిల్లా ఎస్పి ధీరజ్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనతో కలిసి స్టేషన్ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో క్రైమ్ రేట్ ఎంతవరకు ఉంది అని తెలుసుకున్నారు. అదేవిధంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట చౌడేపల్లి సిఐ రాంభూపాల్ సదుం ఏఎస్ఐ సత్యనారాయణ, చౌడేపల్లి ఎస్సై నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కొత్తగా వచ్చిన ఎస్పీ ధీరజ్ ను సదుము మండల తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, అమర్నాథ్, విశ్వనాథరెడ్డి, వినోద్, తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రైళ్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ఎంపి మేడా రఘునాథ్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మేడా రఘునాథరెడ్డి

రాజంపేట, జనవరి 4 ప్రభాతవార్త

రైళ్లలో ప్రయాణికులకు ప్రస్తుతం కల్పిస్తున్న సౌకర్యాలకంటె మరింత మెరుగ్గా అభివృద్ధి చేయాలని వైసిపి రాజ్యసభ సభ్యులు, రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యులు మేడా రఘునాథరెడ్డి కోరారు. ఆదివారం విశాఖపట్టణం లో ఈస్ట్ కోస్ట్ రైల్వే ఆధ్వర్యంలో జరిగిన రైల్వే స్టాండింగ్ అధ్యయన కమిటీ పర్యటన సమావేశంలో రాజ్యసభ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ప్రయాణికుల సౌలభ్యం గురించి ప్రస్తావించారు. ప్రస్తుతం ఉన్న రైళ్ళకు గత చాలా సంవత్సరాలనుండి పాత బోగీలు ఉండడం వలన దూర ప్రయాణం చేసే ప్రయాణీకులకు అసౌకర్యంగా ఉందన్నారు. బోగీలు శబ్దం రావడం వంటి వాటి వలన ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాత బోగీల స్థానంలో నూతన బోగీలను ఏర్పాటు చేయాలని కోరారు.

సంక్షేమ పథకాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

జగన్ కమిషన్ల కోసం కోసం కక్కుర్తి పడే విద్యుత్ రంగం సర్వనాశనం

రాజంపేట టిడిపి ఇన్చార్జ్ జగన్ మోహన్ రాజు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జనవరి 4 ప్రభాతవార్త

సంక్షేమ పథకాల అమలుకు దేశంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బ్రాండ్ అంబాసిడర్ అని, సంస్కరణలకు, టెక్నాలజీకి నాంది పలికి ఆదర్శంగా నిలిచిన నాయకుడని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా అధికారంలో కొనసాగిన చంద్రబాబు నాయుడు హయాంలో అత్యుత్తమ పాలన ఈ నెలల కాలంలో అందించారని కొనియాడారు. లోకేష్ యువ నాయకత్వం కూడా అందుకు తోడైందన్నారు. విద్యుత్ రంగంలో కమిషన్లకు కక్కుర్తి పడి జగన్మోహన్ రెడ్డి హయాంలో వేలకోట్ల ప్రజలపై భారం వేసారని ధ్వజమెత్తారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూ అప్ స్థానంలో ట్రూ డౌన్ చేసి కరెంట్ తగ్గించే పనికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు.తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత జగన్ రెడ్డిదేనని మండిపడ్డారు. 32 వేల కోట్లు ప్రజలపై భారం మోపేలా విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్కు అనుమతినిచ్చిన సీఎం అని విమర్శించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, ఒకవక్క ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, ఇవ్వని హామీలను సైతం అమలు చేసుకుంటూ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలియజేశారు. కేవలం ఒకటిన్నర సంవత్సరంలోనే 98 శాతం హామీలను అమలు చేసిన చరిత్ర చంద్రబాబుది అన్నారు.అంతేకాకుండా వైకాపా ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతులకు యూనిట్ 3.50 వసూలు చేస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీఏ కుటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే 1.50 తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుందని ఈసందర్భంగా చమర్తి జగన్ మోహన్ రాజు గుర్తు చేశారు. అదే జగన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో విద్యుత్ 5.19లకు కోనుగోలు చేస్తే,అదే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 4.70 లకే కొనుగోలు చేస్తుందన్నారు.కేవలం గత ప్రభుత్వ హయాంలో కమిషన్లు కోసం కక్కుర్తి పడి,విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని,ట్రూ ఆఫ్ చార్జీలు 13 పైసలు కుటన్ ప్రభుత్వం తగ్గించడం జరిగిందని చమర్తి వివరించారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్,మండల పార్టీ అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు,పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కె కరీమ్,వీరబల్లి మండల అధ్యక్షులు భానుగోపాలరాజు,పట్టణ ప్రధాన కార్యదర్శి అడపాల శ్రీనివాసులు,పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో అడ్డదిడ్డంగా ఆటోలు

ట్రాఫిక్‌కు నిత్యం అంతరాయంగా ఆటోలు.. ఇబ్బందులు పడుతున్న జిల్లా కేంద్రవాసులు

మదనపల్లె, జనవరి 4 ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉంటున్న మదనపల్లెలో ఆటోలు అవసరానికి మించి ఉన్నాయి. అంతేకాకుండా పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ అడ్డదిడ్డంగా తిరుగుతూ నిత్యం ట్రాఫిక్‌కు ఆటోలు అంతరాయం కలిగిస్తున్నాయి. దీంతో జిల్లా కేంద్రం మదనపల్లెకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మదనపల్లె పట్టణంలో సుమారు 5వేలకు పైగా ఆటోలు నడుపుతున్నట్లు సమాచారం. పట్టణంలో తిరిగే ఆటోలే కాకుండా బయట ప్రాంతాల నుంచి షేర్ ఆటోలు వస్తుండడం వల్ల ట్రాఫిక్‌కు మరింత జఠిలంగా ఉంటుంది. రోడ్లుపైన ఆటోలు ఎక్కడపడితే అక్కడ నిలుపుతుండడం వల్ల ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఆటోల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇష్టారాజ్యాంగా పట్టణంలో ఆటోలు నడుపుతున్నారు. ఆటోలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పొల్యూషన్, ఇన్సూరెన్స్ ఇవేమి లేకుండానే డ్రైవర్లు ఆటోలను అతివేతంతో నడుపుతున్నారు. ఇక డ్రైవర్లకు కూడా లైసెన్స్‌లు ఉన్నాయో లేదా అన్న తనిఖీలు కూడా రవాణాశాఖ అధికారులు చేయడం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. మదనపల్లె జిల్లా కేంద్రం కావడంతో తంబళ్ళపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల నుంచి షేర్ ఆటోలు ప్రయాణీకులు, లగేజిలతో పట్టణానికి వస్తుంటారు. ఆటో కెపాసిటిని మించి ప్రయాణీకులు ఎక్కించడం వల్ల కూడా ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. షేర్ ఆటోలే ఎక్కువుగా పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. పోలీస్, రవాణాశాఖ అధికారులు స్పందించి పట్టణంలోని ఆటోల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీంతో పాటు మిని వాహనాల నియంత్రణకు కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంది. పట్టణంలో కొన్ని వీధుల్లో వన్‌వే మార్గాన్ని కూడా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

పట్టా, డి పట్టా భూమిపై అక్రమార్కుల డేగ కన్ను

కబ్జా చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు.. వేముల మండలంలో భూదందా..

ఆ కబ్జా చేసే విలేకరులకు అధికారుల అండదండలు..

పులివెందుల, జనవరి 4, ప్రభాతవార్త :

పులివెందుల నియోజక వర్గంలోని వేముల మండల రెవెన్యూలో పట్టా,డి పట్టా భూమిని కబ్జా చేసేందుకు సంఘటితంగా సాగుతున్న ప్రయత్నాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి.వేముల మండలంకి చెందిన కొంతమంది పత్రిక విలేకర్లు కబ్జాకి యత్నిస్తుండగా అందుకు మండల రెవెన్యూ అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు.వారిలో ఇద్దరు బడా అధికారులు ఉండటం కొసమెరుపు.కదిరి ప్రాంతానికి చెందిన కొంతమంది వ్యక్తులు,స్థానిక ప్రభావశీలుల సహకారంతో పట్టా,డి పట్టా భూమిపై అక్రమంగా హక్కులు సాధించేందుకు ముందుకు సాగుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఈ కబ్జా యత్నంలో స్థానిక రెవెన్యూ అధికారుల పాత్ర కూడా ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయి.ఈ రెవెన్యూ అధికారులు పలుమార్లు గుట్టు చప్పుడు కాకుండా ఒక చోట పకడ్బంది గా కలుస్తూ రెవెన్యూ భూములు కాసేసేందుకు ఈ విలేఖర్లకు సహకరిస్తూ పట్టా భూమి,అలాగే డి పట్టా లకు గండి కొట్టడానికి రాచబాట వేస్తున్నారు. అధికారుల వంత పాడుతోనే కబ్జాదారులకు రెడ్ కార్పెట్ పడుస్తున్నారు అని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉప రిజిస్ట్రార్ కార్యాలయంలో భూమిని రిజిస్టర్ చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని సమాచారం. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే,పట్టా భూమి,డి పట్టా దస్త్రాలను కూడా సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది,వీరికి గతం లో ఇక్కడ పని చేసిన అధికారులు అలాగే ఇప్పటి అధికారులు పాత రికార్డులను ఆధారంగా చూపుతూ భూమిపై హక్కులు చెలాయించేందుకు ప్రయత్నించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవల భూముల రీసర్వే ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో,వేముల మండలంలో పట్టా భూమి,డి పట్టా భూములను లక్ష్యంగా చేసుకుని కబ్జా యత్నాలు జరగడం గమనార్హం. భూముల సరిహద్దులు స్పష్టమవుతున్న ఈ సమయంలో అక్రమ రిజిస్ట్రేషన్లకు తెరలే పడం భూ మాఫియా బరి తెగింపుకు నిదర్శనంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవ హారంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి,రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేసి సమగ్ర విచారణ చేపట్టా లని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.లేకపోతే పట్టా భూముల భద్రతే ప్రశ్నార్థకంగా మారుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం : డిప్యూటీ తహసిల్దార్ జగదీష్

వేముల మండలంలో భూములు కబ్జా చేస్తున్నట్టు ఎటువంటి సమాచారం మాకు అందలేదు అని కబ్జా చేసినట్టు సర్వే నెంబర్ వస్తే సర్వే చేయించి కబ్జాకు గురి అయ్యుంటే చర్యలు తీసుకుంటాం అని వేముల డిప్యూటీ తహసిల్దార్ జగదీష్ తెలిపారు.

నల్ల గంగమ్మను దర్శించుకున్న ఆర్డీవో శ్రీనివాసులు

సంబేపల్లి జనవరి 4 ప్రభాతవార్త

మండల పరిధిలోనే శ్రీ దేవరాయ నల్ల గంగమ్మను రాయచోటి ఆర్డిఓ శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఆదివారం మండలానికి విచ్చేసిన ఆర్డీవో శ్రీనివాసులకు పి 4దాత, అమెరికా ఎన్నారై శశి భూషణ్ రాజు, రాష్ట్ర పాల ఏకిరి చైర్మన్ నాగేశ్వర్ నాయుడులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారితో కలిసి శ్రీ దేవరాయ నల్ల గంగమ్మ తల్లిని ఆర్డిఓ శ్రీనివాసులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు ఆలయ విశిష్టత గురించి అర్చకులు ఆయనకు తెలియజేసి తీర్థప్రసాదాలను అందజేశారు అనంతరం ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ మహిమాన్వి నల్ల గంగమ్మ తల్లిని దర్శించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నల్ల గంగమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానన్నారు.

సక్రమంగా పాఠశాలకు రండి

దువ్వూరు, జనవరి 04, ప్రభాతవార్త:

దువ్వూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి చదువుతూ ఇటీవల హైస్కూల్‌కు రాని విద్యార్థులను గుర్తించి సక్రమంగా పాఠశాలకు రావాలని కోరుతూ వారి ఇళ్ల వద్దకు ఉపాధ్యాయులు వెళ్లి ప్రోత్సహించారు. హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 6మంది హైస్కూల్ కు రాకపోవడంతో ఆదివారం ప్రత్యేకంగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి ప్రోత్సహిస్తున్నట్లు ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. పరీక్షలు దగ్గరికి వస్తున్నందున సక్రమంగా హైస్కూల్ కు వచ్చి చదువుకొని 10వ తరగతి పరీక్షలు రాయాలని వారి తల్లిదండ్రులకు, విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. దువ్వూరు, నేలటూరు, ఎంకుపల్లె గ్రామాల్లో ఉన్న విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, సురేష్ కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

కలికిరి, జనవరి 4, ప్రభాతవార్త:

స్థానిక పోలీస్ స్టేషన్‌ను అన్నమయ్య జిల్లా ధీరజ్ కునుబిల్లి ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులను ఉద్దేశించి మాట్లాడుతూ పోలీసు యంత్రాంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా జిల్లా ఎస్పీ ఆదివారం కలికిరి అప్‌గ్రేడ్ పీఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. అనంతరం ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి మరియు గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలను కాపాడడానికి పలు ఆదేశాలు జారీ చేశారు. అన్నమయ్య జిల్లాలో ఎక్కడా లేని విధంగా కలికిరిలో ఐటీబీపీ, సీఆర్పీఎఫ్, సైనిక్ స్కూలు, జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు ఉన్నందున పోలీసు వ్యవస్థ ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలన్నారు. సామాజిక నేరాలపై కఠిన చర్యలు ఓపెన్ డ్రింకింగ్, పేకాట, త్రిబుల్ రైడింగ్, కోడిపందేలు, మైనర్ డ్రైవింగ్ వంటి సమాజ వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. మహిళలపై జరిగే నేరాల గురించి, మాదకద్రవ్యాలు, సైబర్ మోసాలు వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల అమరికపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడిన ఎస్పీ విధులు సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబం, పిల్లల భవిష్యత్తుపై కూడా శ్రద్ధ వహించాలన్నారు. సిబ్బందిలో ఆత్మ విశ్వాసం పెంచుతూ విధి నిర్వహణలో సమర్థవంతంగా పని చేసే వారికి రివార్డులు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కె.రామచంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా కోనేరు సుందరికరణ పనులు

బద్వేలుఅర్బన్, జనవరి 4, ప్రభాతవార్త:

బద్వేలు మండల పరిదిలో ఎంతో ప్రసిద్ధి గాంచిన లక్ష్మిపాళెం గ్రామ ఆవరణలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరసామి ఉత్సవాలకోసం ఏర్పాటు చేసిన కోనేరులో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. అనేక సంవత్సరాలుగా ఇక్కడ చెత్త పేరుకుపోయి పిచ్చిచెట్లు మొలచి ఉండడంతో ఆదివారం చైర్మన్ చాటకొండు సంజీవ్‌కుమార్, దేవాదాయ శాఖ ఈవో రామలింగారెడ్డి, జిల్లా స్థాయి స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ఆలయ సిబ్బంది ప్రజలు అందరూ మమేకమై స్వచ్ఛందంగా అక్కడ పేరుకుపోయిన ప్లాస్టిక్ బాటిల్స్, ఇతర చెత్తను తొలగించడంతో పాటు జై శ్రీరామ్ జెండాలు నాటారు. అలాగే ఇక నుంచి అక్కడి నీటినే స్వామి వారి ఉత్సవాలకు వినియోగించేలా ఎంతో వ్యయప్రయాసలకోర్చి కోనేరు పరిశుభ్రతతో పాటు నీటిని శుభ్రం చేశారు. కార్యక్రమంపై బద్వేలుతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్

(గ్రామీణ్) విబి జీ రామ్ జీ 2025" పథకం గోడ పత్రికల విడుదల

కడప,జనవరి 04 ప్రభాతవార్త :

వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) విబి జీరామ్‌జీ 2025" పథకం పై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు ప్రత్యేక గ్రామ సభలను ఈనెల 5న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల నందు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆద

హిందూధర్మ పరిరక్షణ, ఐక్యతతోనేవిశ్వగురు లక్ష్యం సాకారం

ఆర్ఎస్ఎస్ ప్రతినిధి మాలపాటి శ్రీనివాస్ రెడ్డి... అచలానందాశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామి

హిందూ సమ్మేళనంలో మాట్లాడుతున్న విరజానందస్వామి

సమ్మేళనానికి తరలి వచ్చిన ప్రజలు

రాజంపేట, జనవరి 4 ప్రభాతవార్త

భారతదేశం అనుసరిస్తున్న సంస్కృతి,సాంప్రదాయం, మతసామరస్యంతోనే ప్రపంచవ్యాప్తంగా దేశం వైపు చూస్తున్నారని, భవిష్యత్తులో హిందూ ధర్మ పరిరక్షణ, ఐక్యతతోనే విశ్వగురు లక్ష్యం సాధ్యం అవుతుందని ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ కార్యవాహ మాలపాటి శ్రీనివాసరెడ్డి, బ్రహ్మంగారిమఠం అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామి పేర్కొన్నారు. ఆదివారం ప్రభుత్వ క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన హిందూ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ గడప లోపలే కులం, గడప దాటితే హిందువులం అన్న నినాదం ప్రతి ఒక్క హిందువులో అవసరం అన్నారు. కుటుంబం నుంచే హిందూ ధర్మ పరిరక్షణ ప్రారంభం కావాలన్నారు. కులాల గోడలు కూలగొట్టి హిందూ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హిందువులను జాగృతి చేసేందుకు, సంఘటిత పరిచేందుకే దేశవ్యాప్తంగా లక్షహిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.పాశ్చాత్య సంస్కృతిని విడనాడాలని పిలుపునిచ్చారు. ప్రేమ ,ధర్మం, సమానత్వంతో ముందుకు సాగాలన్నారు. అంటరానితనం, అస్పృశ్యతకు చరమగీతం పాడి సహజీవనం చేసినప్పుడే మతమార్పిడులు జరగవు అన్నారు. ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన భగవద్గీత ప్రతి హిందువులో ఒక భాగం కావాలన్నారు. నైతిక విలువల పతనంతోనే సమాజం భ్రష్టుపట్టిపోతుందని, అనైక్యత హిందువులకు శాపంగా మారిందన్నారు. ఒక సభలో ఏ కులం అంటే చేతులెత్తుతున్నారని, అదే హిందువులు ఎవరో చేతులు ఎత్తమంటే నామోషీగా ఫీల్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశం అంటే హిందూ దేశమని గుర్తుంచుకోవాల న్నారు. హిందువులం దరూ భారతీయ సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవస రం ఎంతైనా ఉందన్నారు. ఆఫ్ఘనిస్తాన్లోనే కాదు భారతదేశంలో కూడా హిందువులపై దాడులు తిరుగుతున్నాయని ఈ పరిస్థితిని అధిగమించాలంటే ఐక్యత అవసరం అన్నారు. భారతదేశం నుంచి వెళ్లిపోయిన శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, టిబెట్, మయన్మార్ లాంటి వాటిని మరలా దేశంలోకి తీసుకు వచ్చినప్పుడే విశ్వగురుగా సగౌరవంగా తలెత్తుకు పోగలదన్నారు. హిందూ సమ్మేళనం కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్, దేవరకొండ భానుమూర్తి శర్మ, సంభావువెంకటరమణ, ఆకేపా టి మహేశ్వరమ్మ, యద్దల నందకిషోర్, తుంగ గోపాల్ రెడ్డి ,కాకర్ల రాముడు, పబ్బిశెట్టి సుబ్రహ్మణ్యం, సత్యాల రామకృష్ణ, మందా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు సాంస్కృతి కార్యక్రమాలు, కర్రసాము తదితర సాంప్రదాయం నృత్యాలు చేశారు.

నది ప్రాంతాన్ని కలుషితం చేస్తే కఠిన చర్యలు తప్పవు

ఇఓ నాగభూషణం రెడ్డి

వేంపల్లె: జనవరి 04 ప్రభాతవార్త

నది ప్రాంతాన్ని కలుషితం చేస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక పంచాయతీ ఇఓ నాగభూషణం రెడ్డి హెచ్చరించారు. డంపింగ్ యార్డులో వేయాల్సిన చెత్తను పాపాగ్ని నదిలో వేస్తున్న విషయం ఆయన దృష్టికి వచ్చింది. దీంతో ఆయన స్పందిస్తూ మాట్లాడా రు. పంచాయతీ పరిధిలో ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయరాదని విజ్ఞప్తి చేశారు. అలాగే పంచాయతీ సిబ్బంది కూడా తమకు సూచించిన డంపింగ్ యార్డులో మాత్రమే చెత్తను వేయాలని ఆదేశించారు. వేంపల్లె గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీకీ దోహద పడాలన్నారు.

రక్షణ చట్టం తీసుకురావడం హర్షణీయం

ఉమ్మడి కడపజిల్లా అధ్యక్షులు గూడూరు రామచంద్ర

వేంపల్లె: జనవరి 04 (ప్రభాత వార్త)

రాష్ట్ర ప్రభుత్వం బీసీల భద్రతకు రక్షణ చట్టాన్ని తీసుకురావడం హర్షణీయమని బీసీ ఫ్రంట్ ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు గూడూరు రామచంద్ర పేర్కొన్నారు. బీసీలపై సామూహిక బహిష్కరణ, దూషణ దాడులు, వేధింపులు, ఇతర ఆగత్యాలకు జరగకుండా ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. ఈ చట్టం ప్రధాన ఉద్దేశం బిసి మానవ హక్కుల్ని కాపాడుతుందని అన్నారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చి బీసీల గుండెల్లో చిరస్థాయిగా నిలవాలని పేర్కొన్నారు. అందు కోసం రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు తమిళనాడు తరహా చట్టం చేయాలని గూడూరు రామచంద్ర ప్రభుత్వానికి సూచించారు.

అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ..

వేంపల్లి; డిసెంబర్ 04 (ప్రభాత వార్త)

ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని ఆదివారం వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసి రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కొన్ని కోట్ల మంది దృష్టిలోపంతో బాధపడుతున్నారని,వీరందరికీ లూయిస్ బ్రెయిలీ ఆరాధ్య దైవము అని అన్నారు.ఆరు చుక్కల బ్రెయిలీ లిపిని కనుగొని అంధుల జీవితాలలో వెలుగులు నింపిన చీకటి సూర్యుడు లూయిస్ బ్రెయిలీ అన్నారు. లూయిస్ బ్రెయిలీ పుట్టినరోజు అయిన జనవరి 4వ తేదీని ఐక్యరాజ్యసమితి ప్రపంచ బ్రెయిలీ దినోత్సవంగా ప్రకటించినది అన్నారు. నాలుగు సంవత్సరాల ప్రాయంలో పూర్తిగా చూపు కోల్పోయినప్పటికీ,కేవలం 43 సంవత్సరాలు మాత్రమే జీవించినప్పటికీ లూయిస్ బ్రెయిలీ ఆత్మ విశ్వాసంతో బ్రెయిలీ లిపిని కనుగొని అంధుల జీవితాలలో వెలుగులు నింపి కారణజన్ముడన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపి రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు, సుబ్బారెడ్డి, వేమా రాజా, బద్రి, రాఘవయ్య, ఐచర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్, వనితా క్లబ్ నూతన కమిటి ఎన్నిక

బద్వేలు అర్బన్, జనవరి 4 (ప్రభాత వార్త):

బద్వేలు పట్టణంలోని ఆదివారం సాయంత్రం శ్రీవాసవిక్లబ్ అమ్మవారి సన్నిధిలో వాసవి క్లబ్ జిల్లా కేబినేట్ సెక్రటరి కేవి.సుబ్బారావు ఆధ్వర్యంలో నూతన కమిటిని ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేయించారు. వాసవిక్లబ్ అధ్యక్షులుగా భూ పాళం రాఘవేంద్ర రావు, సెక్రటరిగా చిందుకూరి వెంకటరమణ, ట్రెజరర్గా బైసాని సుమంత్కుమార్, వనితాక్లబ్ అధ్యక్షురాలిగా చాటకొండు కొటేశ్వరమ్మ, సెక్రటరిగా చిప్పగిరి వెంకటసుబ్బమ్మ, ట్రెజరర్ బచ్చు పార్వతమ్మ, నూతన కమిటి సభ్యులు ప్రమాణ స్వీకారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్యవైశ్యవర్తక సంఘం అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, మాజీ అధ్యక్షులు బచ్చు సుబ్రమణ్యం, స్టేట్ ఉపాధ్యక్షురాలిగా కొండపల్లి దేవి, జోన్ చైర్మన్ చింతకుంట ధనలక్ష్మి, మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత, మాజీవనితాక్లబ్ అధ్యక్షులు అనుమల శెట్టి సుబ్బయ్య, భార్గవ్తో పాటు పలువురు వాసవి, వనితాక్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం వాసవి, వనితాక్లబ్ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో కమిటీలుగా ఎన్నుకోవడం సంతోషకరమన్నారు. బద్వేలు ప్రాంతంలో నిరుపేదలుగా ఉన్న ఆర్యవైశ్యులందరినీ గుర్తించి పలువురు దాతల సహకారంతో వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ గతంలో కమిటి సభ్యులు మాదిరే తాము సేవా కార్యక్రమాలు చేపట్టి పలువురు మన్ననలు పొందగలుగుతామన్నారు. తమ కమిటికి కూడా ఆర్యవైశ్యులు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం నూతన కమిటిగా ఎన్నికైన వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్యులు , మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

కలువలతో లాభసాటి వ్యాపారం..

చాలామంది గృహిణులకు ఒక్కోసారి ఖాళీ సమయాన్ని వృథాచేస్తున్నామనే బాధ ఉంటుంది. అయితే కేరళకు చెందిన విజీ అభి ఖాళీ సమయంలో తన మనసుకు నచ్చిన తోట పని చేస్తోంది. వందల రకాల లిలీలను పెంచుతూ నెలకు రూ.లక్షకు పైగా ఆదాయాన్నీ అందుకుంటుంది. ఎలానో తెలుసుకుందాం...

ఇంట్లో పని అవ్వగానే ఎప్పుడెవప్పుడు గార్డెన్‌లోకి వెళ్దామా అని ఎదురు చూస్తుంటుంది విజీ. తన గార్డెన్‌లోకి అడుగుపెట్టగానే రకరకాల రంగుల లిలీలు స్వాగతమిస్తాయి. ఫుల్‌టైం గార్డెనర్ కాకుముందు ఆమె అకౌంటెంట్‌గా పనిచేసేదట. అయితే పిల్లల ఆలనాపాలన చూసుకోవటం కోసం తన ఉద్యోగాన్ని వదిలేసింది. అయితే సొంతగా ఏదో ఒకటి చేయాలనే తపన తనలో ఉండేది. దాంతో ఎంతో ఇష్టమైన గార్డెనింగ్‌ను ఎంచుకుంది. అందులో బొగైన్ విలియాలూ, ఆర్చిడ్లూ, గులాబీలనూ పెంచేది. అప్పుడు సామాజిక మాధ్యమాల్లో.. ఎంతోమందికి రకరకాల మొక్కలు కొనాలనే ఆసక్తి ఉందని గమనించి, వాటర్ ప్లాంట్స్‌ను పెంచుదామనుకుంది.

ఇంటర్‌నెట్‌లో గార్డెనర్స్, ప్లాంటర్స్ సోషల్ మీడియా గ్రూపుల్లో చేరి మొక్కల పెంపకానికి సంబంధించిన మెలకువలు నేర్చుకుంది. అలా ఇంటర్నేషనల్ వాటర్ లిల్లీ అండ్ వాటర్ గార్డెనింగ్ సొసైటీలో చేరి, విదేశాల్లో ఉన్న గార్డెనర్ల సూచనలూ తీసుకునేది. ప్రస్తుతం వంద రకాలకు పైగా వాటర్ లిలీలను తన గార్డెన్‌లో పెంచడమే కాకుండా సొంతగా 'నింఫేయాశ్రీ' అనే కొత్త హైబ్రిడ్ రకాన్నీ ప్రపంచానికి పరిచయం చేసింది. మార్కెట్లో వాటర్ లిలీలకు ఉన్న డిమాండ్‌ను తెలుసుకున్న విజీ, వాటిని ఫేస్‌బుక్ ద్వారా విదేశాలకూ సరఫరా చేసేది. సీజన్లో అయితే నెలకు రూ.లక్షకు పైనే ఆదాయం వస్తోంది. 'ఇంట్లో కూర్చొని, నాకు నచ్చిన పనిచేసుకుంటూ ఆదాయాన్నీ పొందుతున్నా. అంతకంటే కావాల్సిందేముంది' అంటారు విజీ.

అంధుల ఆత్మబంధువు లూయిస్ బ్రెయిలీ

కడప, జనవరి 4, ప్రభాతవార్త

బ్లైండ్ స్కూల్ నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన కందుల చంద్రఓబుల్ రెడ్డి ప్రపంచ అంధులకు జ్ఞాన కవాటలను తెరచి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఫ్రెంచ్ విద్యావేత్త శ్రీ బ్రెయిలీ లిపీ సృష్టికర్త లూ యీ స్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఈరోజు శంకరపురం లోని బ్లైండ్ స్కూల్ లో గల 600 మంది విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారుగడిచిన రెండు రోజుల గా లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా వివిధ ఆటలపోటిలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మరియు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు , ఈ సంధర్భంగా కె ఎస్ ఆర్ ఎం కాలేజ్ ఎన్ ఎస్ ఎస్ విభాగం వాలంటీర్స్ పాల్గొని కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కె ఎస్ ఆర్ ఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్రఓబుల్‌రెడ్డి 600 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కనుమరుగైన డీఏపీ, యూరియా...

దువ్వూరు, జనవరి 04, ప్రభాతవార్త:

మండలంలోని ఎరువుల దుకాణాలలో ఎక్కడా కానీ డిఏపి, యూరియా కనుమరుగైనట్లు కనిపిస్తోంది. రబీ సీజన్లో రైతులు మొక్క జొన్న, జొన్న, వేరుశనగ అక్కడక్కడ కుందూ నది ప్రాంతంలో వరి నాట్లు వేస్తున్నారు. వారికి ఈ సమయంలో డిఏపి, యూరియా ఎంతో అవసరం ఉంది. అయితే ఏ దుకాణంలో కానీ, కార్పొరేట్ సంస్థల్లో కానీ ఈ రెండు ఎరువులు కనబడటం లేదు. మిగతా రసాయనిక ఎరువులు కనబడుతున్నాయి. మిగతా కాంప్లెక్స్ ఎరువులకు సంబంధించి ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు వాటిని కొనుగోలు చేయలేకపోతున్నారు. డిఏపి 50 కేజీల బస్తా ధర 1350 రూపాయలు, యూరియా 267 రూపాయలు ఇవ్వవలసి ఉంది. అయితే ఏ దుకాణంలో కానీ డీఏపీ కనబడకపోగా అంతో ఇంతో ఉన్న యూరియాను అధిక ధరలకు అమ్ముతున్నారు. ఒక్కొక్క దుకాణం వారు 370 నుంచి 425రూపాయాల వరకు విక్రయిస్తూ బస్తా మీద సుమారు 70 రూపాయలు ఎక్కువ తీసుకుంటున్నారు. ఈ విషయంపై వ్యవసాయ శాఖ చర్యలు తీసుకోవాల్సి ఉంది. అంతో ఇంతో రైతు సేవా కేంద్రాలకు యూరియా వస్తున్న అది ఏ మాత్రం రైతులకు సరిపోవడం లేదు. అందువల్ల వ్యవసాయ శాఖ అధికారులు రైతు సేవా కేంద్రాలకు యూరియా, డిఏపి వచ్చే విధంగా చూడాలన్నారు. అలాగే ప్రైవేట్ దుకాణాలపై నిఘా ఉంచి ప్రభుత్వ ధరలకు డీఏపీ, యూరియా అమ్మే విధంగా చూడవలసిన బాధ్యత వ్యవసాయ శాఖపై ఉంది.

పేకాట స్థావరంపై దాడులు

పులివెందుల జనవరి 4 ప్రభాత వార్త :

పట్టణంలోని ఉలిమెళ్ల రోడ్డు నందు ఆదివారం పులివెందుల అర్బన్ ఎస్సై ప్రణయ్ రెడ్డి పేకాట స్థావరంపై జరిపిన దాడుల్లో 8 మంది జూనియర్ మ్యారేజ్ చేసి వారి వద్ద నుంచి 40 వేల రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు విషయం తెలిసింది. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

బర్నవుట్ అవుతున్నారా ?

ఆఫీసు వర్క్ చేస్తున్నప్పుడు ఆకస్మాత్తుగా మధ్యలో పని ఆపేయాలనిపిస్తుంది. రొటీన్‌గా అనిపించి తీవ్ర ఒత్తిడికి లోనవుతుంది. దీన్నే బర్నవుట్ అంటున్నారు నిపుణులు. ఇందులోంచి బయటపడే మార్గాలను సూచిస్తున్నారు.

ప్రస్తుతం పనిలో వేగాన్ని పెంచుకోవడం అనివార్యమైంది. పోటీ కూడా పెరిగింది. అయితే ఈ వేగానికి అతిచేరువలోనే బర్నవుట్ పొంచి ఉంటుంది. ఈ రెండింటి మధ్య సన్నని గీత ఉంటుంది. మొత్తం పనిని వేగంగా పూర్తిచేయాలని ప్రయత్నిస్తూ, తెలియకుండానే మెదడుకు ఒత్తిడి కలిగిస్తాం. పనిలో ఇలా కాస్తంత కూడా విరామం లేకుండా నిరంతరం వేగంగా కొనసాగించుకుంటూ పోతే క్రమేపీ అది అలసట. ఒత్తిడికి దారి తీస్తుంది. దీంతో పనిపే నిర్లిప్తత మొదలవుతుంది. అశ్రద్ధచేస్తే ఈ స్థితి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది.

విభజించాలి: విధుల్లో భాగంగా ఉత్సాదకత పెరిగేలా జాగ్రత్త పడుతూనే ప్రాముఖ్యతను బట్టి పనులను విభజించగలిగే నైపుణ్యాలను పెంచుకోవాలి. ఇతరులు చేయగలిగేవాటిని వారికే అప్పగించాలి. వాటిని పర్యవేక్షిస్తే పనిభారం తగ్గుతుంది. మానసిక ఒత్తిడి దూరమవుతుంది.

తక్షణం కాకపోతే.. కొన్ని పనులు ముఖ్యమైనవే అయినా.. వెంటనే చేయాల్సిన అవసరం ఉండదు. దీర్ఘకాలిక లక్ష్యాలు కోసం పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులుంటాయి. వీటిని వ్యూహాత్మకంగా, ప్రణాళికా బద్ధంగా చేయాలి. దీనికంటూ రోజూ కొంత సమయాన్ని కేటాయించు కోవాలి. ప్రశాంతంగా పూర్తి చేసే పనుల్లో సత్ఫలితాలుంటాయి.

ప్రతిరోజూ .. ఆఫీసుకు రాగానే ఆ రోజు చేయాల్సిన పనులను అత్యవసరం, అవసరం అంటూ విభజించుకోవాలి. వాటిని ప్రణాళికమేరకు పూర్తిచేయగలగాలి. ఆరోగ్యకరమైన జీవనశైలి ధ్యానం, వ్యాయామాలకు చోటివ్వాలి.

పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

దువ్వూరు, జనవరి 04, ప్రభాతవార్త:

ఆరోగ్య కారణాల రీత్యా అలాగే చనిపోయిన వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆదివారం వారి గ్రామాలకు వెళ్లి పరామర్శించారు. మండల కేంద్రమైన దువ్వూరులో వైకాపా ముస్లిం, మైనారిటీ నాయకుడు షాబ్జు ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించి ఆరోగ్యపరంగా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే కానగూడూరులో సుబ్బ నారాయణ అనే వ్యక్తి అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే పెద్ద సింగనపల్లె గ్రామంలో జొన్నవరం హుస్సేన్ రెడ్డి అనే వైకాపా కార్యకర్త ఆరోగ్య రీత్యా చికిత్స పొందుతూ ఆదివారం మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఇరాగంరెడ్డి శంకర్ రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రా రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జార్జి కార్పొరేషన్ క్లబ్‌లో పోలీసుల దాడులు



ప్రొద్దుటూరు క్రైం, జనవరి 4, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు జార్జి కార్పొరేషన్ క్లబ్‌లో ఆదివారం పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఈ దాడులు కొనసాగించినట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వైకాపా బలోపేతంపై దృష్టి సారించండి..

వేంపల్లె: జనవరి 04 (ప్రభాతవార్త)

కడప జిల్లాలో వైకాపా పార్టీని మరింత బలోపేతానికి కృషి చేయాలని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలోని సతీష్ రెడ్డి స్వగృహంలో ఎర్రగుంట్ల కు చెందిన వైకాపా రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మాడిశెట్టి శివకుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వ పాలన లో రైతులు పడుతున్న ఇబ్బందులపై మాట్లాడుతూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు కూటమి ప్రభుత్వంలో గిట్టుబాటు ధర లేదన్నారు.ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కృషి చేయాలని కోరారు. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం అయ్యిందని సతీష్ రెడ్డి అన్నారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందించే వాటిలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లే విధంగా ఆయా ప్రాంతాల్లో ఉన్న వైసీపీ నేతలు కలిసి కట్టుగా పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంతో ఇబ్బందులు పడుతున్న ఆయా రంగాల ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. జగన్మోహన్ రెడ్డికి రోజు రోజుకు ప్రజాదరణ పెరుగుతుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడికక్కడ ఎండగట్టే విధంగా వైకాపా నేతలు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈనెల 7న మానవత సమావేశం

వేంపల్లె శాఖ ఛైర్మన్ బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి

వేంపల్లె: జనవరి 04 ప్రభాతవార్త

ఈనెల 7వ తేదిన మానవత మాసాంతర సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వేంపల్లె శాఖ ఛైర్మన్ బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి వెల్లడించారు. ఈ సమావేశానికి మానవత వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి హాజరవుతారని తెలిపారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలు, పురోగతిపై చర్చించనున్నారు. అలాగే చక్రాయపేట మండలం శాఖను ఏర్పాటుతో పాటు ఆ ప్రాంతంలో బాడి ఫ్రీజర్ ని వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమాలకు మానవత కుటుంబ సభ్యులు తప్పనిసరి హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ఉదయం 8 గంటలకు మాసాంతర సమావేశం ప్రారంభం అవుతుందన్నారు.

ఇవి పంచుకుంటున్నారా..

ఆపాదమస్తకం అందంగా మెరిసిపోవలని అందరికీ ఉంటుంది. అందుకోసం మేకప్‌ను కూడా ఆశ్రయిస్తూ ఉంటాం. ఈ క్రమంలో కొందరు మేకప్ ఉత్పత్తులు అందులో ఉపయోగించే బ్రష్‌లను సైతం ఇతరులతో పంచుకొంటూ ఉంటారు. మీరూ అంతేనా? అయితే జాగ్రత్త! అలా చేయడం వల్ల చర్మానికి హాని కలిగే అవకాశాలు చాలానే ఉన్నాయంటున్నారు నిపుణులు. మురి, సౌందర్య సంరక్షణలో భాగంగా ఏయే ఉత్పత్తులను ఇతరులతో పంచుకోకూడదో తెలుసుకుందామా..

స్నేహితులు లేదా బంధువుల్లో ఎవరివైనా లిప్‌స్టిక్/లిప్‌గ్లాస్/ మేకప్ నరబష్.. ఇలా ఏది కనిపించకపోయినా వెంటనే పక్కనున్న వాళ్లు ఇదిగో.. నాది తీసుకో అంటూ అందించడం లేదంటే మనమే వాళ్లను అడగడం సర్వసాధారణమే. అయితే ఆ క్షణానికి అందంగా కనిపించడానికి అది ఉపయోగ పడినా ముందు ముందు మాత్రం సౌందర్యపరంగా చాలా నష్టాలే ఎదుర్కోవాల్సి రావచ్చు. అందుకే సౌందర్య సంరక్షణలో భాగంగా కొన్ని ఉత్పత్తులను ఇతరులతో అస్సలు పంచుకోకూడదు.

పౌడర్ రూపంలో ఉంటే... మేకప్‌లో ఉపయోగించే ఫౌండేషన్, ఐ షాడో.. వంటివి కొన్ని పౌడర్ రూపంలో కూడా ఉంటాయి. అయితే వీటిని ఒకరి కంటే ఎక్కువమంది చేతితో తాకినా లేదా బ్రష్‌తో అప్లై చేసుకున్నా అందులో బ్యాక్టీరియా చేరే అవకాశాలు ఎక్కువ. ఫలితంగా మొటిమలు రావడం, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు దరిచేరడం వంటి సమస్యలు రావచ్చు. కాబట్టి పౌడర్ రూపంలో ఉన్న ఉత్పత్తులను ఇతరులతో అస్సలు పంచుకోకూడదు.



లిప్‌స్టిక్/లిప్‌గ్లాస్:.. చాలామంది రంగు బాగుందనో లేక మంచి లుక్ ఇస్తుందనో ఇతరుల లిప్‌స్టిక్/ లిప్‌గ్లాస్ ఉపయోగిస్తూ ఉంటారు. అయితే ఇతరులవి మనం ఉపయోగించడం వల్ల వాటిపై ఉన్న బ్యాక్టీరియా మన అధరాల పైకి చేరే అవకాశాలు లేకపోలేవు. అలాగే మన అధరాలపై ఉన్న తేమలో ఉండే బ్యాక్టీరియా కూడా వాటికి తోడై పెదాలకు హాని కలిగించవచ్చు. కాబట్టి ఇవి కూడా ఎవరివి వారూ ఉపయోగించుకోవడం శ్రేయస్కరం.

కళ్ల సంబంధిత ఉత్పత్తులు..... ఐ షాడో, మస్కారా, ఐ లైనర్.. వంటి ఐ మేకప్ ఉత్పత్తులను చాలా జాగ్రత్తగా ఉపయోగించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఇతరుల ఐ మేకప్ ఉత్పత్తులు ఉపయోగించేటప్పుడు వారికి ఏమైనా కళ్ల సంబంధిత ఇన్ఫెక్షన్లు ఉంటే అవి మనకు కూడా వచ్చే అవకాశాలు లేకపోలేవు. అలాగే ఆ ఉత్పత్తుల్లోని బ్యాక్టీరియా వల్ల కళ్లు ఎర్రబడడం, నీళ్లు కారడం, మండడం.. వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి.

మూతలు ఉండేవి.. కొన్ని రకాల క్రీమ్‌లు, పౌడర్లు మూతలు ఉండే చిన్న చిన్న సీసాల్లో లభ్యమవుతుంటాయి. వీటిని కూడా ఇతరులతో పంచుకోకూడదు. అలా షేర్ చేసుకోవడం వల్ల వారు ఉపయోగించినప్పుడు వారి చేతుల్లో ఉండే హానికారక బ్యాక్టీరియా ఈ ఉత్పత్తుల్లోకి చేరుతుంది. అవి మనం వాడడం వల్ల మన చర్మానికి కూడా నష్టం వాటిల్లుతుంది.

మేకప్ బ్రష్‌లు... మేకప్ వేసుకోవడానికి ఉపయోగించే బ్రష్‌లను కూడా ఇతరులతో పంచుకోకూడదు. ఇతరులు వాటిని ఉపయోగించినప్పుడు వారి చర్మం మీద ఉండే బ్యాక్టీరియా, క్రిములు వంటివి మేకప్ ఉత్పత్తుల్లోకే కాదు. వాటిని తిరిగి మనం ఉపయోగించినప్పుడు మన చర్మం మీదకు కూడా చేరతాయి. కాబట్టి మేకప్ వేసుకోవడానికి ఉపయోగించే బ్రష్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడంతో పాటు ఇతరులతో పంచుకోకుండా ఉండ

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

మదనపల్లెక్రైమ్, జనవరి 4 ప్రభాతవార్త.

అందుల జీవితాల్లో వెలుగులు నింపిన ఆశాజ్యోతి, బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ అని ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. లూయిస్ బ్రెయిలి 217 జయంతి వేడుకలను విజువల్లి ఛాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మదనపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ లిపి ద్వారా అంధులు విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారన్నారు. విద్య ద్వారా లోకాన్ని చూడగలగుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుబ్బారెడ్డి, కొత్తవారిపల్లె జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మోహన్, కొత్త ఇండ్లు పాఠశాల ఉపాధ్యాయుడు గురుప్రసాద్, మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, వెంకటరమణ రెడ్డి, నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు కృష్ణమూర్తి, టీచర్ మంజుల, పాలిటెక్నిక్ కాలేజ్ సీనియర్ అసిస్టెంట్ నాగమణి, కృష్ణప్ప, ఐడిబిఐ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్, బీసీ వెల్ఫేర్ కరుణాకర్, భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులు నాగేంద్ర, రెడ్డెమ్మ, రామచంద్ర, ఉపాధ్యాయులు, ఇతర శాఖల అంధ ఉద్యోగులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని బాలుడికి గాయాలు

మదనపల్లెక్రైమ్, జనవరి 4 ప్రభాతవార్త.

ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడు గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని కురబలకోట మండలం, పిచ్చిలవాండ్లపల్లెకు చెందిన మాధవ కుటుంబం మదనపల్లె సీటీఎం రోడ్డులోని టిడ్కో ఇళ్లల్లో నివాసం ఉంటోంది. ఈ క్రమంలో మాధవ కుమారుడు రెడ్డిగణేష్ టిడ్కో ఇళ్ల నుంచి ద్విచక్రవాహనంలో మదనపల్లె పట్టణంలోకి బయల్దేరాడు. మార్గమధ్యంలోని తట్టివారిపల్లి చెరువు కట్టపై ఆర్టీసీ బస్సు మదనపల్లె వైపు వెళుతుండగా దాని వెనుకే వెళ్తున్న కారు బస్సును అధిగమించింది. కారు వెనుకే వెళ్తున్న రెడ్డిగణేష్ బస్సును అధిగమిస్తుండగా బస్సు డ్రైవర్ గమనించుకోకుండా రెడ్డిగణేష్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బాలుడి కాలు విరిగి గాయపడ్డాడు. స్థానికులు గమనించి బాదితున్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై తాలూకా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మదనపల్లెక్రైమ్, జనవరి 4 ప్రభాతవార్త.

విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం విజిలెన్స్ పోలీస్ దిలీప్ కుమార్ మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలోని వలసపల్లి, వేంపల్లి ప్రాంతాలలో కరపత్రాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా దిలీప్ మాట్లాడుతూ రోజువారీ పనుల్లో నిమగ్నమయ్యే రైతులు, మహిళలు, చిన్నారులు, వాహనదారులు తమ అజాగ్రత్త వల్ల విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాదాల వల్ల విలువైన ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, ఎంతోమంది శాశ్వత అంగవైకల్యానికి గురవుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. రాబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చిన్నపిల్లలు గాలిపటాలు ఎగురవేసే సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఏదైనా విద్యుత్ సమస్య లేదా ప్రమాద సూచనలు కనిపిస్తే స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

నేడు రెవెన్యూ క్లినిక్ : తాసిల్దార్

వీరాపునాయునిపల్లి జనవరి 04, ప్రభాతవార్త:

మండలంలోని తాసిల్దార్ కార్యాలయం నందు సోమవారం స్పెషల్ గ్రీవెన్స్ డే (రెవెన్యూక్లినిక్) కార్యక్రమాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ లక్ష్మీదేవి తెలిపారు. ఈ కార్యక్రమానికి పులివెందుల ఆర్డీవో చిన్నయ్య హాజరవుతున్నారని, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భూ సంబంధ ఫిర్యాదులు ఉంటే అర్జీలు సమర్పించాలన్నారు. వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఉన్నాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు.

భగీరథ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తా

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 4 ప్రభాతవార్త

సగర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పేట చంద్రశేఖర్ స్థానిక మండి మర్చంట్స్ వీధిలోని మిల్లులో ఆదివారం సగర సంఘ సమావేశంలో క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సగర సంఘం పెద్దలు మండలంలో లేదా పట్టణంలో మంచి స్థలం గుర్తిస్తే భగీరథుని విగ్రహ ఏర్పాటుకు తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. సగరులను బీసీడి నుంచి బీసీఏకు మార్చాలని ప్రభుత్వానికి విన్నవించామన్నారు. సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మజ్జారి వీరమోహన్ మాట్లాడుతూ సగరులు ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బయ్యన్న మాట్లాడుతూ ఐకమత్యంతోనే సగరుల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యానిక సుబ్బారావు, మాజీ డైరెక్టర్ మురళీ, కోశాధికారి జోడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు వరికూటి సుబ్బరాయడు, కార్యదర్శి వన్నెంపల్లి వెంకటేషు, సూర్యుడు, సురేష్, వెంకట రమణ, జగతి వెంకట సుబ్బయ్య. నాగేశ్వరావు, మజ్జారి లక్ష్మీనారాయణ, మజ్జారి వెంకటరమణ, కులపెద్దలు, ప్రముఖులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మార్ట్ దగ్ధం

గాలివీడు, జనవరి 4(ప్రభాతవార్త):

మండల కేంద్రంలోని బస్టాండు సమీపంలో ఉన్న ఓ మార్ట్ (సూపర్ మార్కెట్)లో ఆదివారం ప్రమాదవశాత్తూ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో దుకాణంలో ఉన్న వ్యాపార సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు బలిజపల్లి గ్రామానికి చెందిన తంగాల గంగాధర్ యాజమాన్యంలోని సూపర్ మార్కెట్ ఆదివారం సెలవు కావడతో మూతవేసి ఉంది. సాయంత్రం ఒక్కసారిగా దుకాణం నుంచి మంటలు చెలరేగాయి. ఇది గమనించిన చుట్టుపక్కల దుకాణదారులు మంటలను ఆర్పి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ జె.నరసింహారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని జేసీబి సహాయంతో షట్టర్లు తొలగించారు. అప్పటికే దుకాణం లోపల ఉన్న సరుకులన్నీ కాలిపోయాయి. నష్టం వాటిల్లిన దృశ్యాన్ని చూసి దుకాణ యజమాని గంగాధర్ బోరున విలపించారు. దుకాణం పూర్తిగా దగ్ధమవడంతో ఆర్థిక నష్టానికి గురయ్యామని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆధార్ స్పెషల్ క్యాంపులు

నందలూరు, జనవరి 4 ప్రభాతవార్త:

మండల పరిధిలోని మూడు కేంద్రాల్లో ఈ నెల 5 నుంచి 9 తేదీల వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కేఆర్ఎం ప్రసాద్ తెలిపారు. నందలూరు సచివాలయం-1, నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎర్రచెరువుపల్లి గ్రామ సచివాలయాల్లో ఈ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. నందలూరులో శివప్రియ, ఎర్రచెరువుపల్లెలో సుభాన్ భాష, నాగిరెడ్డిపల్లెలో మహమ్మద్ రఫీక్ అహ్మద్ ఆధార్ సేవలు అందిస్తారని తెలిపారు. ఆధార్ నమోదు, సవరణలు, అప్డేట్ ల కోసం ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో కోరారు.

పౌష్టికాహారంతో పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు

పులివెందుల,జనవరి 4 , ప్రభాతవార్త :

ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పౌష్టికాహారంతో పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి ఇంజినీర్ నజ్మా అన్నారు. పులివెందుల లోని ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాలకు చెందిన నాల్గవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు లింగాల మండలం పెద్దకుడాల గ్రామంలో ఏడు రోజుల పాటు ప్రత్యేక శిభిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మూడవ రోజు ఆదివారం పెద్దకుడాల గ్రామంలో "పిల్లలకు మరియు మహిళలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం" నిర్వహించారు. అనంతరం "సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల జాతీయ సేవా పథకము కార్యక్రమ అధికారి ఇంజినీర్ నజ్మా మాట్లాడుతూ చిన్న వయస్సులో పిల్లలకు మంచి పోషకాహారం పెడితేనే మంచి భవిష్యత్తు అన్నారు. మహిళలు మరియు పెద్దలు సమతుల్యమైన ఆహారం తీసుకొని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవా పథకము కార్యక్రమ అధికారులు ఇంజినీర్ నజ్మా మరియు డాక్టర్. జయమ్మ, అధ్యాపకుడు డాక్టర్ సాయి శ్రీనివాస్, పీడి. డాక్టర్ రాజశేఖర్, నాల్గవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు, గ్రామంలో ఉన్న పాఠశాల విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణంను అడ్డుకున్న గ్రామస్తులు

నందలూరు, జనవరి 04 ప్రభాతవార్త:

నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో కొత్తగా నిర్మిస్తున్న సెల్ టవర్‌పై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నివాస ప్రాంతానికి సమీపంలో టవర్ ఏర్పాటు చేయడం వల్ల రేడియేషన్ ప్రభావంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, వృద్ధులు, గర్భిణీలు ప్రమాదంలో పడతారనే భయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామస్తులు ఏకతాటిపైకి వచ్చి సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజల వ్యతిరేకతను గుర్తించిన అధికారులు పోలీసుల సమక్షంలో నిర్మాణ పనులను నిలిపివేశారు. కార్యక్రమంలో ఏనుగుల బాలాంజనేయులు, అది నారాయణ మైనారిటీ నాయకులు సయ్యద్ అమీర్, మాజీ ఏజీపీ షేక్ మహమ్మద్ అలీ, ప్యారు, గోపాల్, హనీఫ్, వెంకటేశ్ తదితరులు పాల్గొని ప్రజల ఆరోగ్య భద్రతే ప్రధానమన్నారు.

గంగనపల్లి వెంకటరమణకు సత్కారం

నందలూరు, జనవరి 4 ప్రభాతవార్త :

మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ ఆదివారం కడపలో సత్కారం అందుకున్నారు. జిల్లాకు చెందిన మహాకవి దివంగత వైసివిరెడ్డి శత జయంతి వేడుకల సందర్భంగా సిపి బ్రౌన్ గ్రంథాలయంలో శత జయంతి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. వై.సి.వి. రెడ్డి సమగ్ర సాహిత్యంలోని "మేనక" అనే పద్యకావ్యంపై గంగనపల్లి వెంకటరమణ పరిశోధనాత్మక వ్యాసం రాశారు. వందవసంతాల వై.సి.వి. అనే పేరుతో నిర్వహించిన ఈ సభలో గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రెడ్డి కుమారులు ప్రతాపరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ పురుషోత్తమ రెడ్డి, సిపి బ్రౌన్ గ్రంథాలయ సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, వైసివి రెడ్డి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సాహితీవేత్తలు, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ సమస్య పరిష్కరిస్తా

తంబళ్లపల్లె జనవరి 4. ప్రభాతవార్త ః

నేడు కమ్యూనికేషన్ సిస్టంతో మారుమూల గ్రామాలలో సైతం సెల్ ఫోన్ రాజ్యమేలుతుంటే నేటికీ తంబళ్లపల్లి నియోజకవర్గ కేంద్రానికి సమీపంలో సెల్ టవర్ లేక అన్ని రకాలుగా ప్రజలు వెనుకబడిన దుస్థితి దాపురించింది. కమ్యూనికేషన్ రోజురోజుకు ఎల్లలు దాటుతున్నా ముద్దలదొడ్డికి మాత్రం మోక్షం లభించలేదు. ఈ విషయమై ఆదివారం టిడిపి పార్లమెంట్ రైతు ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డిలు జిల్లా ఇంచార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సైతం నేటికీ సెల్ టవర్ లేకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసి, సెల్ టవర్ ఏర్పాటు చేయడానికి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. సెల్ టవర్ సమస్యపై మంత్రి స్పందించిన తీరుపై టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మెగా క్రికెట్ టోర్నమెంట్

సిద్ధవటం జనవరి 4 ప్రభాతవార్త :

మండలంలోని భాకరపేట గ్రామంలో ఉన్న ఎన్టీఆర్ గ్రౌండ్‌లో జరగబోవు బిపిఎల్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌కు జిల్లా నుండి క్రికెట్ టీములన్ని పాల్గొని విజయవంతం చేయాలని బిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ మేనేజ్‌మెంట్ కోరారు. ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరును నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.1,00,116, రెండవ బహుమతి రూ.50,116 మూడో బహుమతి రూ.15,116లు అందజేస్తామన్నారు. ఈనెల ఏడవ తేదీ నుండి మ్యాచ్ లు ప్రారంభమవుతాయని ఆరవ తేదీ ఎంట్రీ ఫీజుకు చివరి గడువు అన్నారు. వివరాలకు 8074504481, 9177243628, 8309327684 ఫోన్ నెంబర్లుకు సంప్రదించాలన్నారు.

నేడు మదనపల్లె కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ వేదిక

మదనపల్లె, జనవరి 4 ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లా మదనపల్లె కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించేందుకు సోమవారం ఉదయం 10గంటల నుండి ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు జిల్లా కేంద్రం మదనపల్లెతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా నిర్వహించే పిజిఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్జీదారులు మీకోసం.ఏపి.జిఓటి.ఇన్ వెబ్‌సైట్‌ను నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల ప్రస్తుత స్థితికి సంబంధించి సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

పోలేరమ్మ అమ్మవారికి వెండి శరగోపురం బహుకరణ

బ్రహ్మంగారిమఠం జనవరి 04 ప్రభాతవార్త

కందిమల్లాయపల్లి గ్రామ వాస్తవ్యులు ఇటుకల ఓబులేసు కుమారుడు ఇటుకల వెంకటేశ్వర్లు హెల్త్ ఆఫీసర్ వారి ధర్మపత్ని నీలిమ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆజ్ఞ మేరకు నిప్పు తెప్పించిన శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారికి వెండి శరగోపురం పోలేరమ్మ గుడి వద్ద పూజలు నిర్వహించి మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి చేతికి ఆదివారం అందజేశారు. అలాగే శ్రీ కనుమ పోలేరమ్మ ఆలయం వద్ద ప్రతి మంగళవారం శుక్రవారం ఆదివారం శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారి గుడి చుట్టూ ఊరేగింపుగా రథోత్సవంను రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ఆదేశాల మేరకు రథోత్సవాన్ని నిర్వహిస్తున్నామని మేనేజర్ ఈశ్వరయ్య చారి తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులందరూ ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇటుకల రవికుమార్, శీలంనరసింహ, ఇటుకలశ్రీనివాసులు, మఠం సిబ్బంది నాగలింగాచారి, గురుప్రసాద్, చిన్న సుబ్బారాయుడు, పూజారులు పవన్, మిధున్ తదితరులు ఉన్నారు.

గ్రామసభలు విజయవంతం చేయండి

తంబళ్లపల్లె జనవరి 4 ప్రభాతవార్త ః

మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో విబిజి రాంజీ ఉపాధి హామీ పథకం బలోపేతంపై జరిగే గ్రామసభలను విజయవంతం చేయాలని ఏపీవో అంజనప్ప పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మండలంలోని టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు గ్రామ సభలలో గ్రామస్థాయి యాక్షన్ ప్లాన్, వికసిద్భారత్ 2047 లక్ష్యసాధన,ప్రభుత్వం ఉపాధి హామీలో 100 నుండి 125 రోజులు పనిదినాలు పెంపు, 15 రోజుల్లో ఉపాధి లేకపోతే పరిహారం చెల్లింపు, జీతాలు ఆలస్యం లేకుండా రోజువారి పరిహారం ఇంకా పలు రకాల అభివృద్ధి పనులపై చర్చ జరపాలన్నారు. ఈ గ్రామ సభలకు సర్పంచులు, వార్డు మెంబర్లు, మహిళా సంఘాలు, రైతులు, కూలీలు, ప్రజలు హాజరయ్యేలా చూడాలని సూచించారు. ఈ సమీక్షలో ఈసీ మహేష్, టిఏలు సుజాత, పుష్పకుమారి, భూదేవి, బాలగంగాధర్, కంప్యూటర్ ఆపరేటర్ రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

ఒంటిమిట్ట జనవరి 04 (ప్రభాతవార్త)

ఒంటిమిట్ట దిగువ వీధిలో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన నిన్న రాత్రి వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహరాజు ఆదివారం సాయంత్రం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం రాత్రి లాస్య ప్రియ (31) తమ గృహంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందిందని తమ ప్రాథమిక దర్యాప్తు ద్వారా తెలిపారు. ఆ సమయంలో తన భర్త,కూతురు, మృతురాలు ఉన్నారని, మృతురాలు నెల్లూరు జిల్లాకు చెందిన అమ్మాయని తల్లిదండ్రులు లేరని సిస్టర్ దక్షిణాఫ్రికాలో ఉన్నదని, 8 ఏళ్ల కిందటే వివాహమైందన్నారు. మృతురాలి భర్త పేరు అనిల్ అని కువైట్ నుంచి రావడం జరిగిందని గత కొద్ది కాలంగా ఇరువురి మధ్య తగాదాలు, ఇతర కారణాలు ఉన్నట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. మృతురాలి కుటుంబీకులు ఇచ్చిన వివరాల మేరకు కేసు నమోదు పంచనామా నిమిత్తం కడప రిమ్స్ తరలించామని, పంచనామా ఆధారాల మేరకు దర్యాప్తు ప్రారంభిస్తామని సిఐ తెలిపారు.

పారిశుద్ధంపై కమిషనర్ ప్రత్యేక దృష్టి

యర్రగుంట్ల జనవరి 4, ప్రభాతవార్త :

మున్సిపల్ కమిషనర్‌గా వీధులు నిర్వహిస్తున్న శేషఫణి స్థానిక ప్రజల మన్ననలు పొందడం విశేషం. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తున్నారని పలువురు ప్రశంసిస్తున్నారు. ప్రతిరోజు తెల్లవారుజామునే పారిశుద్ధ కార్మికులను ఆయన స్వయంగా పర్యవేక్షించడం, రోడ్లపై ఆక్రమణలను ఎప్పటికప్పుడు తొలగించడం, మంచినీటి సరఫరా వ్యవస్థపై రోజువారి సమీక్షించడం చేస్తున్నారు. కార్యాలయాన్ని వివిధ పనులపై సందర్శించే ప్రజలతో కమిషనర్ మమేకమవుతారని, వారి సమస్యలపై తక్షణమే స్పందించి చర్యలకు ఆదేశాలిస్తారని జనాలు చెప్పుకుంటున్నారు. ఏది ఏమైనా కమిషనర్ అంకితభావంతో పనిచేస్తున్నారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

అయోధ్య, వారణాసి విశిష్టతలపై ప్రసంగం

ప్రొద్దుటూరు, జనవరి 4, ప్రభాతవార్త

గుంటూరు శ్రీ సత్యసాయి స్పిరిచువల్ సిటీలో జరుగుతున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలలో భాగంగా రెండో రోజు ఆదివారం ప్రస్తుత రైల్వే కోడూరు ఎమ్మెల్యే గవర్నమెంట్ విప్ అరవ శ్రీధర్‌కి అమరావతి ఏపీ అసెంబ్లీలో ఓఎస్డీగా పనిచేస్తున్న, ప్రొద్దుటూరుకు చెందిన డాక్టర్ ఎం ప్రభాకర్ ఆధ్యాత్మిక వేదికలో అయోధ్య, వారణాసి విశిష్టతల గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి శైవ పీఠాధిపతి, శ్రీశ్రీశ్రీ శివ స్వామి ముఖ్యఅతిథిగా విచ్చేసి, డాక్టర్. ఎం. ప్రభాకర్ ను ఘనంగా సత్కరించి ఆశీర్వదించారు. పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

కక్షలు ద్వేషాలకు పోకుండా

కలసి మెలసి ఉండాలి : సిఐ రోషన్

చిన్నమండెం జనవరి 4 ప్రభాతవార్త:

ప్రజలు కక్షలు ద్వేషాలకు దూరంగా ఉండి కలసి మెలసి ఉండాలని రాయచోటి రూరల్ సిఐ రోషన్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం మండలంలోని మల్లూరు క్రాస్ రోడ్డు వద్ద సాతంత్రం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చట్టాలపై సూచనలు సలహాలు ఇచ్చారు. రాజకీయాలు ఐదు సంవత్సరాలకు ఒకసారి వస్తాయి పోతాయి కానీ గ్రామములో ప్రజలు మాత్రం అందరూ ద్వేషాలు పెంచుకోకుండా కలిసిమెలిసి ఉండాలని ఆయన సలహాలు ఇచ్చారు, తల్లిదండ్రులు బిడ్డలు చదువు విషయంలో ప్రతిరోజు వారితో మాటామంతి జరపాలని ఇంటర్ డిగ్రీ విద్యార్థులు కొన్ని చెడ్డ అలవాట్లకు పాల్పడడం జరుగుతుందని మంచి దారిలో వారు నడచేటట్లు చూడవలసిన బాధ్యత తల్లిదండ్రుల దేనని ఆయన తెలిపారు. గ్రామాలలో ఎలాంటి సమస్యలు ఉన్న ఎస్సై, సిఐ ఫోన్ నెంబర్లకు ఎప్పటికప్పుడు సమాచారం అందించి గ్రామ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.ప్రజలు మంచిగా మెలగాలని తన పిల్లల భవిష్యత్తును మంచిదారుల్లో ఉండేటట్టు చూసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కొంతమంది గ్రామస్తులు గ్రామాలలో రాత్రి సమయంలో కోళ్ల దొంగతనాలు మోటార్ల వద్ద వైర్లు కత్తిరింపులు లాంటి సమస్యలు ఉన్నాయని సీఐకు తెలియజేశారు. వాటిని నివారించడం జరుగుతుందని తాగుడుకు అలవాటు అయినటువంటి కొంతమంది బైకులపై తిరుగుతూ చైన్ దొంగతనాలు కు అలవాటు పడటం జరుగుతుందని అలాంటి వి జరగకుండా చూసే బాధ్యత అందరిదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ముల్లూరు క్రాస్ రోడ్డు, కొత్తపల్లి,నేరెళ్లవంక, శ్రీనివాసపురం, శ్రీరాంనగర్ కాలనీ రోడ్డు వారకురోపల్లె గ్రామ ప్రజలు మరియు ఏఎస్ఐ రఘురామయ్య హెడ్ కానిస్టేబుల్ రవి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సంక్రాంతి-స్వచ్ఛపై ప్రత్యేక గ్రామసభలు

నందలూరు జనవరి 4 ప్రభాతవార్త;

మండలంలోని 12 గ్రామపంచాయతీలలో స్వచ్ఛ సంక్రాతి - స్వచ్ఛ గ్రామ పంచాయతీ-2026" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5వ తేదీ సోమవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. గౌరవ పంచాయతీ రాజ్ కమిషనర్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వుల మేరకు ఈ గ్రామ సభలు నిర్వహించాలని కడప జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఉత్తమ పనితీరు ప్రదర్శించిన మూడు గ్రామపంచాయతీలను గుర్తించి ఈ నెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో గ్రామ పెద్దలను సత్కరించనున్నట్లు తెలిపారు. చెత్తరహిత గ్రామపంచాయతీ అనే ప్రధాన అజెండాతో ఈ సభలు నిర్వహించనుండగా ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల భాగస్వామ్యంతో స్వచ్ఛతను నిరంతరం కొనసాగించేందుకు తీర్మాణాలు ఆమోదించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామపంచాయతీల ప్రజలు ఈ ప్రత్యేక గ్రామసభల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కే.ఆర్.యం. ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ మాల్యాద్రి కోరారు.

తెలంగాణ సిఎం వ్యాఖ్యలపై ఏపి సిఎం స్పందించాలి

వైకాపా నాయకులు డిమాండ్

మదనపల్లె, జనవరి 4 ప్రభాతవార్త :

సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమాదానం చెప్పాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ డిమాండ్ చేశారు. ఆదివారం వైకాపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటుకు నోటు కేసు నుంచి నేటి రాయలసీమ లిఫ్ట్ఇరిగే

హెల్మెట్ ధరించడంపై అవగాహన

రాయచోటి టౌన్ జనవరి 4 ప్రభాతవార్త

జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు, రాయచోటి డీఎస్పీ కృష్ణ మోహన్ మార్గదర్శకత్వంలో రాయచోటి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ కులయప్ప మాట్లాడుతూ... ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ వాడకం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టం గణనీయంగా తగ్గుతుందని వివరించారు. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతపై బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన పాంప్లెట్లు పంపిణీ చేశారు. రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఎస్ఐ జహీర్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు చార్జీలు తగ్గింపుతో ప్రజలకు ఊరట

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి

ప్రొద్దుటూరు జనవరి 4 ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల తగ్గింపుతో ప్రజలకు మారం తగ్గించినట్లు అయిందని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం అడ్డగోలుగా కమిషన్ల కోసం 5.19 పైసలకు విద్యుత్ కొనుగోలు చేసి, 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచడంతో పాటు, ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై అధిక భారం వేసిందని, కానీ కూటమి ప్రభుత్వం విద్యుత్‌ను 4 రూపాయల 70 పైసలకి కొనుగోలు చేసి, విద్యుత్ ఛార్జీలు పెంచకపోవడంతో పాటు, ట్రూడౌన్ ఛార్జీలతో ప్రజలకు ప్రయోజనకరం కలిగించిందని వివరించారు. దీనికి తోడు సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పట్టణంలో కూడా అన్ని రకాల అభివృద్ధి, రోడ్డు విస్తరణ పనులు చేస్తోందని తెలిపారు. అనంతరం జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి జబీవుల్లా మాట్లాడుతూ మండలంలోని చౌడూరు లో ప్రభుత్వ భూమి ఏపిఐఐసి కి కేటాయించారే కానీ రైతుల భూమి ఎక్కడ లాక్కోలేదని వివరించారు. అనంతరం టిడిపి పట్టణాధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు ఆనందంగా వున్నారన్నారు. ప్రజలు మరో 10 15 సంవత్సరాలు కూటమి ప్రభుత్వాన్ని ఆదరిస్తే పూర్తి అభివృద్ధి జరుగుతుందని వివరించారు.

వడ్డే ఓబన్న జయంతిని విజయవంతం చేయండి

ములకలచెరువు జనవరి 4 ప్రభాతవార్త

వడ్డే ఓబన్న జయంతి వేడుకలను విజయవంతం చేయాలని వడ్డెర సంఘం నాయకులు కోనంగి శ్రీనివాసులు నాగమల్లప్ప కోరారు. ఆదివారం ములకలచెరువులో వడ్డెర కులస్తులు సమావేశం నిర్వహించారు. ఈ నెల 11న వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వడ్డెరలందరూ ఏకతాటిపై ఉండి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వడ్డెరలు రాణించే విధంగా ఏకతాటిపై ఉండాలన్నారు. త్వరలో మండలంలో వడ్డెర సంఘం ఏర్పాటు చేసి బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామంజులు, కృష్ణామూర్తి, శంకరనారాయణ, మస్తాన్, హనుమంతు, సంఘం హరి, విజయ్ కుమార్, ప్రతాప్, నాగభూషణ ఉన్నారు.

కట్టా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ములకలచెరువు జనవరి 4 ప్రభాతవార్త

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించి ముందుకు వెళ్లాలని మదనపల్లి డి.ఎస్.పి మహేంద్ర. ఆదివారం మొలకలచెరువులో తంబలపల్లి టిడిపి యువ నాయకులు కట్టా దొరస్వామి నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కట్ట క్రికెట్ టోర్నమెంట్ను మొలకలచెరువులో మదనపల్లి డిఎస్పి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో యువత కోసం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కట్టా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం యువతకు అదృష్టమన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలలో రాణించి ప్రతిభ చూపాలన్నారు. అనంతరం దొరస్వామినాయుడు మాట్లాడుతూ యువత కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టే యువతను అన్ని విధాల ప్రోత్సహిస్తామన్నారు. అనంతరం టోర్నమెంట్ను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ పాలగిరి సిద్ధ, టిడిపి నాయకులు వెంకటస్వామి, నాగరాజు యాదవ్, ప్రతాప్, సుధాకర్, రెడ్డెప్ప, నిర్వాహకులు విజయ్ నాయుడు, వెంకీ, వంశీ పాల్గొన్నారు.

వెనిజులాపై అమెరికా కుట్రలను ఖండిస్తున్నాం

బద్వేలు అర్బన్, జనవరి 4 ప్రభాతవార్త

వెనిజులా అధ్యక్షుడికి వ్యతిరేకంగా అమెరికా, దాని మిత్రదేశాలు చేపడుతున్న అప్రజాస్వామిక చర్యలను భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య కడప జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు బద్వేల్‌కు చెందిన ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. స్వతంత్ర దేశమైన వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధమని అన్నారు. వెనిజులా ప్రజల తీర్పును గౌరవించకుండా అక్కడి ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు అమెరికా ప్రయత్నించడం ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగిస్తోందన్నారు. వెనిజులాలోని సహజ వనరులపై కన్నేసి ఆర్థిక ఆంక్షలు విధించడం ద్వారా సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం అమానుషమని విమర్శించారు. అమెరికా జోక్యాన్ని వెంటనే నిలిపివేయాలని, తమ నాయకుడిని ఎన్నుకునే హక్కు వెనిజులా ప్రజలకే ఉందని స్పష్టం చేశారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న వెనిజులా ప్రజలకు, యువతకు డివైఎఫ్ఐ సంపూర్ణ సంఘీభావం తెలుపుతోందని పేర్కొన్నారు.

జిల్లా జోనల్ స్థాయి పోటీ పరీక్షలలో అవార్డులు

సుండుపల్లి, జనవరి 04,ప్రభాతవార్త :

మండలంలోని వశిష్ట, చైతన్య విద్యాసంస్థలకు కడప జిల్లా జోనల్ స్థాయి పోటి పరీక్షలో అవార్డుల వర్షం కురిసింది. వివరాలలోకి వెళితే, స్టార్ జూనియర్ లెవెల్ 1 .ఛాంపియన్ టి నాగసహస్ర జిల్లా ఫస్ట్ ప్రైస్, స్టార్ జూనియర్ లెవెల్ 2 .ఛాంపియన్ జె సిద్ధార్థ గౌడ్ జిల్లా ఫస్ట్ ప్రైస్,స్టార్ జూనియర్ లెవెల్ 3 .బెస్ట్ పెర్ఫార్మర్ ఎస్ ఐ మాన్ జిల్లా సెకండ్ ప్రైస్,జూనియర్ లెవెల్ 2. ఛాంపియన్ జి హరికృష్ణ జిల్లా ఫస్ట్ ప్రైస్సీ,నియర్ లెవెల్ 1.ఛాంపియన్ ఎస్ ఆఫ్సియా జిల్లా ఫస్ట్ ప్రైస్, సీనియర్ లెవెల్ 2.గన్సులేషన్ జి నాగ ప్రతాప్ సీనియర్ లెవెల్ 4.ఛాంపియన్ జి లహరి జిల్లా ఫస్ట్ ప్రైస్, సీనియర్ లెవెల్ 5.ఛాంపియన్ ఎస్ భవ్య శ్రీ జిల్లా ఫస్ట్ ప్రైస్, విజువలైజేషన్ ఛాంపియన్ నిహారిక జిల్లా ఫస్ట్ ప్రైస్, చైతన్య పాఠశాల విద్యార్థి జూనియర్ లెవెల్ 3.ఛాంపియన్ జి విహాన్ రాజ్ జిల్లా ఫస్ట్ ప్రైస్అ వార్డులు సాధించారు. విశ్వం ఏడుటెక్ హైదరాబాద్ డైరెక్టర్ కె పవన్ కుమార్, రాయలసీమ జోన ల్ ట్రైనర్ గా ర్జున బహుమతులు ఇవ్వడం జరిగింది. ఇలాంటి మరి ఎన్నో అవార్డులు సాధించి పాఠశాలకు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు మరియు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.

శిల్పారంలో అలరించిన చిన్నారుల నృత్యాలు

కడప కార్పొరేషన్ జనవరి 4 ప్రభాతవార్త

ఆదివారం కడప శిల్పారామంలో సాయంత్రం 6.30 సాంస్కృతిక కళావేదిక మీద పద్మాకర్ వారి సహకారంతో కడప నగరానికి చెందిన మిను డాన్స్ అకాడమీ బృందం వారు పల్లె జానపదాలు, శాస్త్రీయ నృత్యాలు, సినీ నృత్యాలతో ప్రేక్షకులను అదరహో అనిపించాయి .చికిరి చికిరి, వాన వాన, మీసాల పిల్ల వంటి పాటలకు చిన్నారులు నృత్యాలు వేశారు. సాంస్కృతి కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి ఎస్. కృష్ణప్రసాద్ పర్యవేక్షించారు.

బధిరులలో మరింత ఆత్మవిశ్వాసం కల్పించాలి

న్యాయవాది జింక విజయలక్ష్మి

వేంపల్లె :జనవరి:04(ప్రభాతవార్త)

బధిరులలో మరింత ఆత్మవిశ్వాసం కల్పించేందుకు కృషి చేయాలని న్యాయవాది జింక విజయలక్ష్మి అన్నారు. ఆదివారం జిల్లా అసోసియేషన్ ఆఫ్ డెఫ్ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రొద్దుటూరు పట్టణంలోనీ మున్సిపల్ గ్రౌండ్ లో ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. అలాగే బధిరుల మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం జిల్లా సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు శివచంద్రారెడ్డి భోజన సౌకర్యాన్ని అందించినట్లు వేంపల్లె భవిత దివ్యాంగుల కేంద్రం ఐఇఆర్టీ యశోద వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ఆఫ్ డెఫ్ అధ్యక్షుడు కిషోర్, మహిళా అధ్యక్షురాలు ధరణి కుమారి, నాగమణి, ఇర్ఫాన్, నారాయణ రెడ్డి, సంతోష్, షాకీర్, భరత్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

దాతల దాతృత్వం మరవలేనిది

వృద్ధాశ్రమానికి సీలింగ్ ఫ్యాన్లు వితరణ

వేంపల్లె :జనవరి:04:(ప్రభాత వార్త)

దాతల దాతృత్వం మరవలేనిదని స్థానిక మధర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమ నిర్వాహకుడు అల్ఫాన్స్ రెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లె మహిళా స్ట్రీట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యుల సహకారంతో ఆశ్రమానికి అవసరమైన సీలింగ్ ఫ్యాన్లు వితరణ చేశారు. అనంతరం వృద్ధులకు బిస్కెట్ లు పంచిపెట్టారు. వీరి సహకారానికి వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు. అనాథవృద్ధాశ్రమ అభివృద్ధికి, తోడ్పాటుకు దాతలు ముందుకు రావడం హర్షించదగ విషయం అని అల్ఫాన్స్ రెడ్డి వెల్లడించారు.

విరిగిన స్తంభాలతో రైతుల ఇబ్బందులు

కలసపాడు, జనవరి 4 ప్రభాతవార్త:

మండలంలోని చెన్నారెడ్డి పల్లి గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఎప్పుడు విరిగిపడతాయని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. చెన్నారెడ్డి పల్లె ఓ రైతు పొలం దగ్గర గత కొన్ని సంవత్సరాలు నుంచి విద్యుత్ స్తంభం విరిగిందని అధికారులకు ఎన్ని మార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని విరిగిన విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని రైతులు కోరుకుంటున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

బద్వేలు అర్బన్, జనవరి 4, ప్రభాతవార్త:

పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం అర్బన్‌సీఐ లింగప్ప వ్యాపారులకు మరియు వాహనదారులకు సూచనలు ఇచ్చారు. వాహనదారులు ఎక్కడ పడితే అక్కడ వాహనాలు ఆపరాదని, తోపుడు బండ్లు, వాహనాలు రోడ్డుకు అడ్డంగా పెడితే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రోజురోజుకు పెరిగిన జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ పెరిగిపోతోందని కావున ట్రాఫిక్ సక్రమంగా నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందించాలని, వాహనాలు తోలే ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనాలకు సంబంధించిన రికార్డులు వారి వద్ద ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న సిగ్నల్స్‌ను పాటించాలని తదితర సూచనలు ఇచ్చారు.

సంఘటితమైతేనే సమాజానికి మేలు

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 4 ప్రభాతవార్త

ప్రొద్దుటూరులోని నామ ఎరుకలయ్య ఆశ్రమంలో శ్రీ కృష్ణ గీతాశ్రమం బస్తీ ఆధ్వర్యంలో ఘనంగా హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేదాంత గీత ఫౌండేషన్ అధ్యక్షులు ఆచార్య అభినవ శంకరనంద స్వామీజీ మాట్లాడుతూ సంఘటితమైతేనే సమాజానికి మేలని సమాజం మరియు ప్రజలు బాగుండాలన్న అంతా సంఘటితమవ్వాలని క్రమశిక్షణ శ్రద్ధ కలిగిన సాంప్రదాయాలను పాటించడం సాధ్యమన్నారు. అలాగే ప్రపంచంలో ఉన్న హిందువులంతా ఒక తాటిపైకి రావాలని ఆయన అన్నారు అంతేకాకుండా అంతేకాకుండా భారతదేశంలోని సంస్కృతి సాంప్రదాయాల పట్ల విదేశీయులు కూడా మక్కువ చెబుతున్నారని భారతదేశంలో కుటుంబ వ్యవస్థ కూడా చాలా బలమైనదిగా ఉన్నదన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలు పట్ల భావితరాలకు అలవాటు చేసే విధంగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంగిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, శ్రీ కన్నా భాస్కర్ విద్యా భారతి ప్రాంత సంఘటన మంత్రి, డాక్టర్ సోమా లక్ష్మీ నరసయ్య, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు చీతిరాల నాగార్జున రావు, హిందూ సమ్మేళన సమన్వయకర్త డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మారెళ్ళ మల్లికార్జున రావు, నాగమునిరెడ్డి, మురళి, రమేష్, పాల్గొన్నారు.

ట్రస్టీపై చెక్కు బౌన్స్ ఫిర్యాదు విచారణార్హమే

(ఎన్.ఐ. ఆక్టు ప్రకారం ట్రస్టును నిందితునిగా చేర్చకపోయినప్పటికీ... సుప్రీం కోర్టు తీర్పు)

బద్వేలు లీగల్, జనవరి 04 ప్రభాతవార్త:

ఏదేని ట్రస్టు తరుపున చెక్కుపై సంతకం చేసినా ట్రస్టీపై చెక్కు బౌన్సు ఫిర్యాదును విచారించవచ్చని 2025 అక్టోబరు నెల 9వ తేదీన ఓ తీర్పును వెలువరించింది. ట్రస్టు అనేది చట్టపరమైన వ్యక్తి కానందున, దావా వేయదు లేదా దావాను ఎదుర్కొనలేదు. కాబట్టి ట్రస్టు రోజువారీ వ్యవహారాలకు బాధ్యత వహించే ట్రస్టీలు ముఖ్యంగా చెక్కుపై సంతకం చేసిన వ్యక్తి బాధ్యత వహించవలసి ఉంటుందని న్యాయస్థానం అభిప్రాయపడింది. "చెక్కు బౌన్సు కారణంగా చర్య తీసుకోవాల్సిన సందర్భం తలెత్తినపుడు ఎన్.ఐ. ఆక్టు చట్టం క్రింద ఫిర్యాదు నమోదు అయినపుడు చెక్కుపై సంతకం చేసిన ట్రస్టీపైనే విచారణ జరుపడం సాధ్యమవుతుంది. ట్రస్టును నిందితుడిగా పేర్కొనవలసిన అవసరం లేదు" అని దేశ అత్యున్నత న్యాయస్థానం సుస్పష్టంచేసింది. వివరాల్లోకి వెళితే.. ఓరియన్ ఎడ్యుకేషన్ ట్రస్టు జారీ చేసిన చెక్కుపై వచ్చిన కేసును జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా లతో కూడిన ధర్మాసనం విచారించి అనుసంధాన సేవలకుగానూ అప్పీలుదారుకు జారీ చేసిన చెక్కుపై ట్రస్టు చైర్మెన్ అయిన ప్రతివాది చేవ్రాలు చేశాడు. తగినన్ని నిధులు లేనందున ఆ చెక్కు బౌన్సు కాగా ప్రతివాదిపై ఎన్.ఐ ఆక్టు సెక్షన్-138 మరియు 142 లు క్రింద అప్పీలుదారు వ్యక్తిగతంగా ఫిర్యాదు చేశారు. ట్రస్టును నిందితుడిగా పేర్కొనకపోవడంతో దాని చైర్మెన్ అయిన ప్రతివాదిపై చర్యలు తీసుకోవడం కుదరదంటూ హైకోర్టు ఈ ఫిర్యాదును తిరస్కరిస్తూ కొట్టివేయగా విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ తీర్పును ప్రక్కన పెట్టింది. ఎస్.ఎమ్.ఎస్. ఫార్మాస్యుటికల్స్ లిమిటెడ్ ఎదిరి నీతీభల్లా (2005 సం॥) మరియు కె.కె. అహూజా ఎదిరి వి.కె.ఓరా (2009 సం॥) వ్యాజ్యములను ఉటంకిస్తూ చెక్కుపై సంతకం చేసినవ్యక్తి ఆ చర్యకు స్పష్టంగా బాధ్యత వహిస్తాడని, ట్రస్టును విడిగా విచారించకుండగనే అతనిపై విచారణ చేపట్టవచ్చని పేర్కొనింది. ప్రతివాది అయిన ట్రస్టు చైర్మెన్ చెక్కుపై అధీకృత చేవ్రాలు దారు హోదాలో వ్యక్తిగతంగా సంతకం చేశాడు. కాబట్టి ఆ చెక్కును జారీ చేసిన చర్యకు ఆయన ప్రాథమికంగా బాధ్యత వహించాలి. ట్రస్టును నిందితుడిగా చేర్చవలసిన అవసరం లేకుండానే ఆయనను బాధ్యునిగా చేయాలనికూడా కోర్టు నిర్ణయించింది. దీని ప్రకారం అప్పీలు అనుమతించబడి చెక్కు బౌన్సు కేసుపై ట్రయల్ కోర్టులో విచారణను పునరుద్ధరింప చేయాలంటూ ట్రస్టును నిందితుడిగా పేర్కొనకుండానే ట్రస్టీపై చెక్కు బౌన్సుఫిర్యాదు విచారణార్హమే అంటూ అత్యున్నత న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది. (క్రిమినల్ అప్పీలు.../2025 ఎస్ఎల్‌పి టు అప్పీలు నెం.4459/2023)

ఘనంగా హిందూ సమ్మేళనం

హిందూవుల ఐక్యతపై వివరించిన వక్తలు

ముద్దనూరు,జనవరి04, ప్రభాతవార్త:

పట్టణ పరిధిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ర్యాలీగా బయలుదేరి కోలాటాలతో హిందూ ఐక్యతను చాటి చెప్పారు. శ్రీ వివేకానందుని జూనియర్ కాలేజీ ఆవరణములో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హిందూ సమ్మేళన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రమణానంద స్వామి మాట్లాడుతూ 1925లో స్థాపించబడిన ఈ సంస్థ, హిందుత్వ భావజాలంతో దేశ సాంస్కృతిక ఐక్యతను, దేశభక్తిని ప్రోత్సహిస్తుందన్నారు. సంఘ్ పరివార్ అనిపిలువబడే పెద్ద సంస్థకు మాతృసంస్థగా పనిచేస్తూ, మానవ విలువలు, సంస్కారం, దేశభక్తిని నేర్పించడం లక్ష్యంగా విద్య, కార్మిక, విద్యార్థి శాఖల ద్వారా సామాజిక సేవ, దేశ నిర్మాణంపై దృష్టి పెడుతుంది. ఈ సమ్మేళనం ద్వారా హిందువుల దేశ ఐక్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రముఖ సంచాలకులు రంగారావు, తిమ్మాపురం సుబ్బారెడ్డి (ఎల్ఐసి), లెక్చరర్ పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరింత విస్తృతం చేస్తాం

అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

పీలేరు, జనవరి 4 ప్రభాతవార్త:

లయన్స్ క్లబ్ ప్లాటినం సేవలు మరింత విస్తృతం చేస్తామని ఆ శాఖ అధ్యక్షులు గ్యారంపల్లె రమేష్కుమారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్లాటినం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్ యార్డు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం గొర్రెలు, మేకలు వ్యాపారులు, రైతులకు అనుగుణంగా అన్నదానం నిర్వహించామని తెలిపారు. అలాగే సోమవారం (నేడు) స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్లాటినం కార్యదర్శి సోమిశెట్టి సురేష్బాబు, ట్రెజరర్ శివగణేష్, డిస్ట్రిక్ట్ ఆఫీసర్ సంజీవరెడ్డి, జోనల్ చైర్పర్సన్ వేణుగోపాల్." సభ్యులు వెంకటేశ్వరరెడ్డి, సురేంద్రనాథరెడ్డి, బాలాజి, ప్రసాద్, హరీష్బాబు తదితరులు పాల్గొన్నారు.

నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

ఎడ్యుకేషన్ జనవరి 4 ప్రభాతవార్త:

Indias Business Iconic Awards - 18వ ఎడిషన్ కార్యక్రమంలో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థకు బెస్ట్ ప్రొఫెషనల్ స్కిల్ ట్రైనింగ్ అకాడమీ అవార్డు లభించింది. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ నాణ్యమైన స్కిల్ డెవలప్‌మెంట్ మరియు ఉపాధి కేంద్రిత శిక్షణకు ఉన్న బలమైన నిబద్ధతకు గుర్తింపుగా నిలిచింది. సంస్థ తరఫున ఈ అవార్డును ఉదయగిరి రాజా, డైరెక్టర్ - కర్ణాటక రాష్ట్ర ప్రాజెక్ట్స్ అధికారికంగా స్వీకరించారు. 2016 నుండి స్కిల్ డెవలప్‌మెంట్ రంగంలో నిరంతర సేవలందిస్తున్న నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్, యువతకు ఉద్యోగోన్ముఖ శిక్షణ అందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. సంస్థ NSDC అప్రూవ్డ్ ట్రైనింగ్ పార్ట్నర్గా, DDU-GKY, PMKVY, ESDM వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల కింద ప్రాజెక్ట్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా సేవలందిస్తోంది. ఇప్పటివరకు 14,000 మందికి పైగా అభ్యర్థులకు శిక్షణ అందించి, 11,000 మందికి పైగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం సంస్థ ప్రధాన విజయంగా నిలిచింది. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా డిమాండ్ ఆధారిత కోర్సులు అందించడం సంస్థ ప్రత్యేకత. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, ఈ అవార్డు మా బృందం చేసిన కృషికి లభించిన గౌరవం. యువతకు నైపుణ్యాధారిత విద్య, స్థిరమైన ఉపాధి కల్పించడమే మా ప్రధాన లక్ష్యం. భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవలందిస్తాం" అని తెలిపారు. ఈ అవార్డుతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ స్కిల్ ట్రైనింగ్ రంగంలో విశ్వసనీయ సంస్థగా తన స్థానాన్ని మరింత బలపరుచుకుంది.

వైభవంగా హిందూ సమ్మేళన కార్యక్రమం

సమ్మేళనలో పాల్గొన్నా దృశ్యం

మదనపల్లె, జనవరి 4 ప్రభాతవార్త :

పట్టణంలో ఆదివారం హిందూ సమ్మేళన కార్యక్రమం వైభవంగా జరిగింది. అమ్మచెరువుమిట్ట నుంచి హిందూసమ్మేళన ఆహ్వాన సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, టిడిపి నాయకులు దొరస్వామినాయుడులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులంతా ఐక్యతగా ఉండి సత్తాను చాటుకోవాలన్నారు. అనంతరం పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు 1వ వార్డు ఇన్‌చార్జ్ మల్లికార్జుననాయుడు, జేసి రెడ్డప్ప, బండి ఆనంద్, భువనేశ్వర్ సత్యా, నారదరెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ వాచ్‌మెన్ మృతి

పెండ్లిమర్రి, జనవరి 4, ప్రభాతవార్త:

మండలంలోని తహసీల్దారు కార్యాలయం వాచ్‌మెన్ దేవదానం కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గత 3 రోజుల క్రితం కడప నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటూన్నాడు. ఆదివారం పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఆయన కుటుంబీకులు తెలిపారు. సోమవారం తమ స్వగ్రామంలో అంత్యక్రియలు జరుగుతాయన్నారు. తహసీల్దారు కార్యాలయ సిబ్బంది ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

భవానీ సేవలో ప్రజా ప్రతినిధులు

-దర్శించుకొన్న ఎమ్మెల్యే గురజాల

దర్శనానంతరం వెలుపలికి వస్తున్న గురజాల

బోయకొండ(చౌడేపల్లి), జనవరి 4 ప్రభాతవార్త

శక్తిస్వరూపిణీ బోయకొండ గంగా భవానీని పలువురు ప్రముఖులు దర్శించుకొన్నారు. అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌లు ఆలయానికి వచ్చారు. వారితోపాటు కుటుంబ సభ్యులను ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. మండపంలో వేదాశీర్వాదం, కుంకుమార్చన అనంతరం దుశ్శాలవాలతో సత్కరించి అమ్మవారి మెమెంటోలందించారు. అమ్మవారి దర్శనభాగ్యం తమకెంతో ఆనందానిచ్చిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల అన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబునాయుడు, గీర్వాణీ చంద్రప్రకాష్, బోయకొండ జన్నే సుబ్రమణ్యం నాయుడు, పాళెం రెడ్డి, శివప్ప, రామకృష్ణ, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది, తేదేపా నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా హిందూ సమ్మేళనం తరలివచ్చిన జనసందోహం

రామసముద్రం జనవరి 4 ప్రభాతవార్త

మండల కేంద్రంల